క్లుప్తంగా

ఆక్రమణ స్థలాన్ని కాపాడాలి

పెద్దారవీడు: మండలంలోని సానికవరం బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణకు గురైన స్థలాన్ని కాపాడాలని రామాయపాలెం, సానికవరం గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. సానికవరం బస్టాండ్ సెంటర్‌లోని రామాయపాలెం వెళ్లే రహదారిలో గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారు. రహదారి ఇరుకుగా ఉంటుందని, దాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించవద్దని గ్రామానికి చెందిన వ్యక్తికి పలుమార్లు చెప్పినా వినకుండా రోడ్డుకు అడ్డంగా నిర్మాణం చేపట్టారని గ్రామస్తులు తెలిపారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించాలని, ఆక్రమించిన వ్యక్తి నుంచి స్థలాన్ని కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కొమ్ముల గురవయ్య, బి.సుబ్బారెడ్డి, మస్తాన్, వీరనారాయణ, రమేష్, పి.యల్లయ్య, కె.వెంకటయ్య, ఎం.సీతయ్య, డి.కాశిం, వెంకటేశ్వర్లు, కె.అవులయ్య, పెద్ద యోగయ్య, జక్కరయ్య, వెంకట నారాయణ, పి.రామారావు, ఎస్.అనిల్, ఆదాం, ఏసేబు, ప్రకాశం, కె.చిన్నయోగయ్య, తిరుపతయ్య ఉన్నారు.

ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

దర్శి: మండలంలోని పోతవరం సచివాలయం పరిధి శేషంవారిపాలెం, కొత్తపల్లి సచివాలయం పరిధి కృష్ణాపురం ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని చందలూరు మెడికల్ అధికారి డాక్టర్ బ్లెస్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

శంకర నేత్రాలయానికి వృద్ధులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న వైద్యాధికారి

తాళ్లూరు: కంటి ఆపరేషన్‌లు అవసరమైన వృద్ధులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సోమవారం పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు తరలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ శంకర కంటి వైద్యశాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తాళ్లూరు నుంచి 60 మంది, ముండ్లమూరు మండలం నుంచి 103 మంది ఆపరేషన్లకు తరలించినట్లు పీఎండీఓ ఉమా తెలిపారు. సీహెచ్‌ఐ రమణమ్మ, హెచ్ఎస్ పీవీ రవి పాల్గొన్నారు.

వానమ్మా.. ఒకసారి వచ్చిపోమ్మా!

దొనకొండ: అప్పులు చేసి పొలాలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పది రోజులు కావస్తోంది. వాన ఎప్పుడు పడుతుందో.. పొలంలో విత్తనాలు ఎప్పుడు నాటాలోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కంది, ఆముదాలు, పత్తి విత్తనాలు విత్తేందుకు వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేసి ఇళ్లల్లో పెట్టుకున్నారు. పల్లెల్లో ఏ పనులు లేక చెట్ల కింద, రచ్చ బండల వద్ద, దేవాలయాల వద్ద రైతన్నలు ఉదయం, సాయంత్రం ముచ్చటలాడుకుంటున్నారు. దొనకొండ ప్రాంతం వర్షాధార పంటలు ఎక్కువ భాగం సాగు చేస్తారు. మే నెలలో కాసిన ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి చెరువులు, కుంటలు ఎండిపోయాయి. మరికొద్ది రోజులు ఇలానే ఉంటే ఖరీఫ్ సీజన్ కూడా దాటి పోతుంది. పంటలు పండకపోతే ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుంది. నోరు లేని గేదెలకు పశుగ్రాసం, తాగు నీరు కరువై పోతుంది. ట్రాక్టర్ గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.20 వేలు పలుకుతుంది. ఈ ఏడాది గడ్డు పరిస్థితి ఏర్పడేలా ఉందని, ఏ పంటలు పండుతాయో, ఏం తిని బతకాలో, ఎలా అప్పులు తీర్చాలో, శుభకార్యాలు ఎలా చేయాలో అంటూ రైతన్నలు డీలా పడ్డారు. ఏ గ్రామం చూసినా, ఏ రైతన్నను పలకరించినా కాలం సరిగా లేదంటూ దిగాలు పడుతున్నారు.



గంగదేవిపల్లిలో విత్తేందుకు సిద్ధం చేసిన పొలం



రచ్చబండపై రైతులు

సర్పంచ్ పవన్‌తో ఎమ్మెల్యే తాటిపర్తి ములాఖత్

పెద్దదోర్నాల: అక్రమ కేసులతో అరెస్టయి మార్కాపురం సబ్ జైలులో ఉన్న చిన్న గుడిపాడు సర్పంచ్ వల్లభనేని మల్లికార్జున అలియాస్ పవన్‌ను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ములాఖత్ అయ్యారు. సోమవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డితో కలిసి మార్కాపురం సబ్‌జైలుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మల్లికార్జునను కలిసి ధైర్యం చెప్పారు. రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయాలనే ఇటువంటి కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తానున్నానని ధైర్యం చెప్పారు. వల్లభనేని మల్లికార్జునను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ జోగి వెంకటనారాయణతో పాటు పలువురు మండల నాయకులు ఉన్నారు.



ములాఖత్ అనంతరం బయటకు వస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

తొట్లు నిర్మించి నీరు నింపాలి

ముండ్లమూరు (కురిచేడు): గొర్రెలు, పశువులకు తాగునీటి సమస్య తీర్చాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం, శంకరాపురం గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ముండ్లమూరు మండలం శంకరాపురంలో 2500 గొర్రెలు, వెయ్యి గేదెలు ఉన్నాయన్నారు. గ్రామంలో మెజారిటీ కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. వర్షాలు లేక వాగులు, కుంటలు ఎండిపోవటంతో పశువులకు, గొర్రెలకు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. తాగునీటి కోసం రోజూ 5–6 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. మండలంలోని అన్ని గ్రామాల్లో నీటి తొట్లు కట్టించారుగానీ శంకరాపురంలో నీటితొట్లు కట్టించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొట్లు కట్టిన గ్రామాల్లో కూడా నీరులేక పెంపకందారులు కుటుంబాలను వదిలి సుదూర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామ పొలాల్లో నీటితొట్లు నిర్మించి, బోర్లు వేయించి నీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, గ్రామ కమిటీ కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, మేదరమెట్ల శంకరరావు, బిల్లా వీరాంజి, బొజ్జ కుమార్, రావులపల్లి రవికుమార్ పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



దారం వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కామిరెడ్డి బ్రహ్మారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



బాలకృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి (కురిచేడు): దర్శి మండలంలో ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సన్మానించారు. దర్శి పడమర ఎంపీపీఎస్ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కామిరెడ్డి బ్రహ్మారెడ్డి దంపతులను, మండలంలోని జముకులదిన్నె ఎంపీపీఎస్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన దారం వెంకట రామిరెడ్డిని, పాతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన గువ్వల బాలకృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు రఘురామయ్య, రమాదేవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని సన్మానించి శేషజీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డి.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది వాహనాలకు జరిమానా



మునెయ్య కాలనీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కురిచేడు: మండలంలోని ఆవులమంద పంచాయతీ పరిధి ప్రతిజ్ఞాపురి కాలనీలో సోమవారం ఉదయం త్రిపురాంతకం సీఐ అస్సాన్, ఎస్సై శివల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేశారు. గ్రామంలోని అన్ని ప్రాంతాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని పది వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. త్రిపురాంతకం, దొనకొండ ఎస్సైలు శివబసవరాజు, త్యాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ముండ్లమూరు (కురిచేడు): రైతుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి కోరారు. మండలంలోని శంకరాపురంలో మండల కమిటీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం జరిగాయి. తరగతులను ఉద్దేశించి కొండారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అన్ని రకాల పంటల ధరలు గతంతో పోల్చితే సగానికి పడిపోయాయన్నారు. గత సంవత్సరం పొగాకు సగటు ధర కిలోకు రూ.275పైగా ఉంటే ఈ ఏడాది మేలు రకం పొగాకు సగటు ధర కిలో రూ.230 మించలేదన్నారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోలు ప్రారంభించలేదన్నారు. బ్యారన్ ఒక్కింటికి నాలుగు, ఐదు లక్షల రూపాయల నష్టం వచ్చే పరిస్థితి కనిపిస్తోందన్నారు. మార్కెట్ యార్డులో దళారుల దోపిడీ విపరీతంగా పెరిగిందని విమర్శించారు. దోపిడీని అరికట్టేందుకు మార్కెట్ కమిటీ యాక్ట్ పటిష్టం చేస్తానన్న ప్రభుత్వాలు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. దళారుల దోపిడీకి వ్యతిరేకంగా గుంటూరులో మిర్చి రైతులు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో బర్లీ పొగాకు రైతులు విశాఖ జిల్లాలో పాల రైతులు అనేక ఆందోళనలు నిర్వహించారని తెలిపారు. నల్లబర్లీ రైతుల ఆందోళనతో దిగివచ్చిన ప్రభుత్వం రూ.350 కోట్లు కేటాయించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం చివరకు పొగాకు కాడ కొనుగోలు చేసేంత వరకు రైతులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సి ఉందన్నారు. మిర్చి రైతులకు ఇస్తామన్న రూ.150 కోట్ల సాయం ఇంతవరకు అందలేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తామన్న ప్రభుత్వాలు ఈ పాటికి ఉన్న వాటిని కూడా ప్రైవేట్ వ్యాపారులకు కట్టబెట్టిందని, పంటల బీమా అమలు చేస్తామన్న ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పీకల్లోతు అప్పుల్లో ఉన్న రైతులు ప్రీమియం కట్టలేక పంటల బీమా పొందలేకపోతున్నారన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు పెట్టుకున్న అర్జీలు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని, కేంద్రం తెచ్చిన విద్యుత్ రెగ్యులేటరీ చట్టం ప్రకారం అదానీ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్భాటంగా ప్రారంభించిన అనేక నీటి ప్రాజెక్టులు నిధుల కేటాయింపు జరగక అసంపూర్తిగానే ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో పశ్చిమ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు అవసరంకాగా రూ.359 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని, మల్లవరం ప్రాజెక్టు గేట్లు ఇంతవరకు పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. గ్రీన్ ఎనర్జీ బయోగ్యాస్ వంటి పేర్లతో వేలాది ఎకరాల పంట భూములు అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ ఖనిజ సంపదను చట్ట విరుద్ధంగా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. ఈ విధమైన రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను నివారించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. కరేడులో బలవంతపు సేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతాంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం విధించడం సరైంది కాదని, వెంటనే నిర్బంధాన్ని ఆపి రైతులతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతురావు, పంటా ఏడుకొండలు, గాలి వెంకటేశ్వర్లు, రాజా రమేష్, రామాంజనేయులు, సుబ్బారావు, నారాయణ, అన్నమయ్య, పున్నారావు, వెంకటేశ్వర్లు, రవి, జయమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండారెడ్డి

కౌలురైతు పత్రాలు తీసుకోవాలి

పెద్దారవీడు: రైతులకు కౌలు కార్డులు తప్పకుండా ఇవ్వాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలుదారులకు సీసీఆర్సీ మంజూరుపై సోమవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూయజమాని హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం కౌలుదారుల హక్కు చట్టం 2019లో అమలులోకి తీసుకొచ్చిందని, కౌలుకు తీసుకున్న రైతుకు ఆ సంవత్సరం పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని చెప్పారు. భూమి యజమానుల హక్కులకు ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. కౌలు రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో, సాగు చేసే భూ యజమాని పొలం పాస్‌బుక్ జిరాక్స్‌ను గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలన్నారు. కౌలు కార్డు కేవలం 11 నెలల పరిమితితో జారీ చేస్తామన్నారు. పొలంపై ఎలాంటి హక్కు ఉండదని, అమ్ముకునేందుకు కుదరదని తెలిపారు. వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కౌలుదారు కార్డు తీసుకుంటే కౌలుదారులకు పంట నమోదు చేయించుకునేందుకు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు, పండిన పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. మండలంలో 1147 మంది కౌలుదారులకు కార్డులు ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామని వివరించారు. డీటీ రామకృష్ణ, ఆర్ఐ గోపి, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ



తహసీల్దార్‌కు బొకే అందిస్తున్న సిబ్బంది

తాళ్లూరు: మండల కేంద్రం తాళ్లూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సంజీవరావు పదవీ విరమణ పొందారు. ముండ్లమూరు తహసీల్దార్‌గా ప్రస్తుతం పని పనిచేస్తున్న లక్ష్మీనారాయణకు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సంబంధ సమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు ఫణీంద్ర, ప్రశాంత్, సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్వోలు, సిబ్బంది చందు, రియాజ్, సుజాత పాల్గొన్నారు.



పశ్చిమ ప్రాంతంలో ఆధునిక వైద్యసేవలు

మార్కాపురం/గిద్దలూరు రూరల్: ఒకప్పుడు వైద్యసేవలు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేవి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. సాధారణ వైద్యులే కాకుండా స్పెషలిస్టు వైద్యులు సైతం మండల కేంద్రాల్లో సేవలందిస్తున్నారు. ఒకప్పుడు అత్యాధునిక వైద్యసేవలు కావాలంటే సుదూర ప్రాంతాలైన నంద్యాల, గుంటూరు, ఒంగోలుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మార్కాపురం, గిద్దలూరు వంటి పట్టణాల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలను అందించే వివిధ ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. మార్కాపురం పట్టణంలోని సీతారామ శాస్త్రి హాస్పిటల్, పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న శశాంక్ ఈఎన్‌టీ హాస్పిటల్, గిద్దలూరులోని డాక్టర్ హరినాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీజీఆర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల, డాక్టర్ జీవీ నారాయణ లిటిల్ స్టార్స్ చిల్డ్రన్ హాస్పిటల్ తదితర ఆస్పత్రులు అత్యాధునిక వైద్యసేవలను ప్రజలకు చేరువ చేశాయి.

